# కవితా కౌముది

## సుషుప్తి
## కే.వి. బలరామమూర్తి

మనసు భోషాణంలో
అంతులేని సంపద
తలపులకు.
తాళం తెరుచుకుంటున్నది
ఆలోచనల లోచనాలు
సూక్ష్మ సేద్యం చేస్తున్నాయి.
పొరల తెరలు చీల్చుకొని
మొలకలు తొంగిచూస్తున్నాయి
కలత నిద్ర
నిశీధిని కొలుస్తున్నది
మాగన్నులో చిక్కిన
స్వప్నం జారిపోతున్నది.
అలలా మరోకల
కలలో కల
కలగాపులగం
పసికలలు
వసివాడలేదింకా
అమ్మ తలంటుతున్నది
పీటమీద ఏడుపు
తలగట్టిగా పట్టి
నిరంకుశం
కుంకుడు రసం
కళ్ళ మంట
ఏవండీ!
మల్లెపూలు తలలో పెట్టండి
అర్థాంగి పరిమళం
ఏరా! ఇక్కడున్నావ్?
క్లాసు లేదా?

స్కూలు ముందు
బజ్జీల గురవయ్య
బండినుంచి కమ్మని వాసన
సిగ్గులేదురా! బెంచిఎక్కు
ఎదురుగా ఇంగ్లీషు టీచరు
ఇప్పుడే సుబ్బారావు వచ్చాడు
అప్పు కావాలట
రేపు పెళ్ళికెళ్ళాలి
డబ్బు లేదు
టికెట్ లేకుండానే
గాల్లో ప్రయాణం
భయం
క్రింద కనిపించలేదు
గాల్లో నేను
చిన్నప్పటి
ఆడ ఫ్రెండు
జీడీ ఇచ్చింది
తీపి తీపి
స్వరస్థానం తప్పిన
అపస్వరాల
స్వప్నావస్థ
ముఖాలు మారుతున్నాయి
దృశ్యాలు కట్టుతప్పుతున్నాయి
ఎడిటింగు
ఏడిసినట్టుంది
ఇక చాల్లే
కళ్ళు తెరిపిడి లేదు
భయం..
ఏమయింది?

బలవంతాన
పెనుగులాడి
రెప్పలూడి తెరిచాయి
దప్పిక
చెంబెడు నీళ్ళు
గుటుక్కు గుటుక్కు
అమవస నడినెత్తిన
చుట్టాలంతా
ఒక్కసారి దిగబడినట్టు
తారాగణం
తోరణం కట్టింది
సగం నిద్ర
మళ్ళీ మగత
కలలేవీ?
ఏదో వెలితి
సుషుప్తిని
ఎవడో ముని
తన్నుకెళ్ళాడు
తపస్సు వినా గతిలేదు
తపస్సు...తపస్సు
ఒకటే తపస్సు
హాయిగా
ఆలోచనలను మింగేస్తూ
సుషుప్తి..సుఖనిద్ర
మనసు
నశించింది
తపసు ఫలించింది.

★★★

# వర్షం

ఆర్.ఎస్.వెంకటేశ్వరన్

నాకూ వర్షానికీ మధ్య
నిలువెత్తు వయసు గోడ లేచింది
చిన్న నాటి ఆ వర్షం
నేడు నాకు దూరమయ్యింది

జల జలా కురిసే వర్షపు ధారల్ని
మిల మిలా మెరిసే మెరుపు చారల్ని
కూర్చుని కిటికీ లోంచి చూస్తున్నాను
ప్రకృతి పులకరింతల్ని
చూసి మాత్రమే ఆనందిస్తున్నాను

ఒక్కసారిగా నాలోంచి ఓ చిన్న బాలుడు
జర జరా వర్షంలోకి పరుగులెత్తబోయాడు
నాలోని పెద్దరికం రెక్కలు పట్టుకుని
బర బరా వెనుకకు లాగేశాడు

నాకూ వర్షానికీ మధ్య
నిలువెత్తు వయసు గోడ లేచింది
చిన్న నాటి ఆ వర్షం
నేడు నాకు దూరమయ్యింది

జోరుగా కిటికీ అద్దాల్ని తిడుతున్న చినుకులు
జారుతూ నాట్యం చేస్తున్నట్టు అనిపించేయి
చిన్నతనంలో తనతో ఆటలాడుకున్నందుకు
తనలోకి నన్ను పిలుస్తున్నట్టు తలపించేయి
ఆడుతూ నీళ్ళని విసురుగా తన్నిన కాళ్ళు
పెంకులను నీళ్ళలో కప్పగంతులేయించిన వేళ్ళు
కళ్ళముందే కరిగిన కలలా అనిపించేయి

నాకూ వర్షానికీ మధ్య
నిలువెత్తు వయసు గోడ లేచింది
చిన్న నాటి ఆ వర్షం
నేడు నాకు దూరమయ్యింది

నేడు జోరుగా కురిసే వర్షం
చెవులకు హోరులా వినిపిస్తోంది
శరీరం మోసే ఖరీదైన సూటూ బూటూ
బురదలో తడిసి పాడైపోతాయనిపిస్తోంది
ఏరులై పారే కాలువ నీరు
రోగ భయం కలిగిస్తోంది
ఘర్జించే గగనాలు
వర్షించే మేఘాలు
ఇప్పుడు భయపెడుతున్నాయి
నన్ను లోపలికి నెడుతున్నాయి

నాకూ వర్షానికీ మధ్య
నిలువెత్తు వయసు గోడ లేచింది
చిన్న నాటి ఆ వర్షం
నేడు నాకు దూరమయ్యింది.

★★★

## మగనాలు
## తేజశ్విని రవి

గుండె లోతుల్లో పేరుకున్న అగాధాన్ని
తన చుట్టూ లోకానికి చూపలేక
అన్నీ తానే అనుకున్న తన వెర్రితనాన్ని
వెక్కిరిస్తూన్న ఆ మెళ్ళో తాడును
మౌనంగా మోస్తూ .............మగనాలు
తన పగిలిన గుండెల పైన బరువు కొల
అడుగడుగునా ఆవిరైపోతూన్న ఆమె కల
తన తీరని కోర్కెల కొలిమి వెల
కేవలం రెండు పసిడి బిళ్ళలు
అనుకోలా, ఆ ఆలి అప్పుడు – ఎప్పుడూ
తనలోని తనతో పనిలేని లోకాన్ని చూస్తూ
తనలోని తననుంచీ తనూ తప్పించుకుంటూ
రంగులద్దుకుంది
పెదాలకు నవ్వు పులుముకుంది
సంసారచక్రం పరిభ్రమణంలో
చర చరా తిరుగుతూ
గిర గిరా తనని తిప్పుతున్నా
చక్రం లయం తప్పకూడదని
తనూ అక్కడనే తాళం వేసింది
చప్పట్లు సంసారానికి వదిలింది
ఇక్కట్లు తన సిగలో తురుముకుంది
ఎంతైనా 'మగ'నాలు.

★★★

## సాలీడు గూడు
## వెంకట్ దశిక

ఎప్పుడు మొదలయ్యిందో
ఎక్కడికో తెలియని ఈ పరుగు
ఒక సారి ఆపి వెనుకకు చూస్తే
ఎంత దూరం వచ్చేసానో!!..నాతో నేను విడిపోతూ
నాచుట్టూ ఎన్ని చిక్కు ముళ్ళో!!

దూరంగా ఎక్కడో..
బిక్కు బిక్కు మంటూ జ్ఞాపకాల దీపాలు

వెనక్కి పోదామని చూసానో
నన్ను పట్టుకు లాగుతూ
నాతోనే నాలోనె ఉన్న ఎందరో 'నేను ' లు
అక్కడే ఉంటే ఎంత బాగుండేదో!
నాతో నేను ఒక్కడినే ఉన్న రోజులవి

కానీ..
గమ్యం గమనం లేని జీవనం ఉంటుందా?
ఆశల పల్లకిలో సాగే పయనం ఆగుతుందా?
ఏమో ఎవరికి తెలుసు?
నిన్నటి నవ్వులు రేపు మళ్లీ వస్తాయేమో?

మళ్లీ పరుగు మొదలు
నిన్నటి మెరుపులు వెతుక్కుంటూ రేపటి వైపు

★★★

# గజల్

గుడిపూడి రాధికా రాణి

వేకువందున మరో రోజుకు స్వాగతమ్మును పలికిచూడూ
రాత్రివేళన తప్పుఒప్పుల మౌనగీతిక పాడిచూడూ

కాలమెంతటి కఠినమైనా వేచిచూడగ కనికరించును
ఓర్పునందున దాగుశక్తిని విత్తనములో వెతికిచూడూ

కాకి ఎంగిలి రుచులు పంచే బాల్యమెంతటి కావ్యమగునో
చెలిమిపుస్తక మధురస్మృతులను గుండెపొరలో తొంగిచూడూ

పెళ్ళివైభవమెంత చెప్పను వందలుండెను వంటకమ్ములు
పారవేసిన మెతుకు విలువను అన్నదాతను అడిగి చూడూ

సన్నజాజుల పరిమళాలే ఎండవేళన హాయియౌనా?
అందమంటే చెమటచుక్కను వాస్తవమ్మును చెప్పిచూడూ

నోటుకన్నా ఓటుగొప్పను ఊకదంపుడు మాటలేలా?
నీతివిలువను రుజువుచేయగ డబ్బుతాకక మసలిచూడూ

కీర్తియెంతటి తృప్తినిచ్చును నిదురయన్నది చేరువవదే
నిన్నుమించిన నీడపొడవును సంతసమ్మున కొలిచిచూడూ

స్వర్ణమయమగు ఆలయమ్మున నోట్లకట్టల మొక్కులేలో ?
మెట్లబారున దైవముండెను పాత్రదానము చేసిచూడూ

రాధమదిలో బాధయన్నది మాధవునికే తెలియలేదా
ఆమెహృదిలో విరహవేదన తీర్చవేణువునూదిచూడూ

★★★

# ఆమె

చందలూరి నారాయణరావు

ఆమె
గోదావరి .
మాటలు గలగలలు....

ఆమె
వెన్నెల
చల్లదనానికి దన్ను.

ఆమె
పచ్చని పైరు.
నేలకు ఓ కళ ....

ఆమె
చక్కెరకేళి.
పలుకు బహుతీపి....

ఆమె
గోరింటాకు.
ఎర్రని కనువిందు.....

ఆమె
మల్లె మాల
ముచ్చట్లన్నీ సువాసనలే....

ఆమె
తేనే ఊట.
అడుగుతీపి బాటే..

ఆమె
మధురం
ప్రతిక్షణం అనుభూతే...

★ ★ ★

ఆమే
కొందరికి "అమ్మ"లా
కొందరికి "అక్క"లా

ఆమే
కొందరికి "స్నేహం"లా
కొందరికి "సహ ధర్మచారి"లా

ఆమే
కొందరికి "ప్రియురాలు"లా
కొందరికి "ప్రియ బంధావి"లా

ఆమే
కొందరికి "ఊహ"లా
మరి కొందరికి "కవిత"లా

★★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

అంత బ్రతుకును తారుమారయ్యె నేడు
ఔషధములేవి యుపయుక్తమగుటలేదు
తలప రుగ్మత లేదు నా తనువునందు
మనసు బలహీనతకెవడు మందునిచ్చు?

ప్రేమలో పడి యొకనాడు పిచ్చిదయ్యె
తల్లిదండ్రులతోనెన్నొ తగవులెపుడు
ఎల్లవేళలలో స్పర్ధలెవరితోనొ
ఏల మనసెప్పుడిట్లు కల్లోలమగును?

నిశ్చలమ్ముగనుండలేనిది మనస్సు
ఎపుడు వ్యాకులమై యుండునీ మనస్సు
నిబ్బరమ్ముగ తానెట్లు నిలువగలదు
ఎట్లు పైబడునిడుమలనెదురుకొనును?

బ్రతుకు సర్వము పూవుల పాన్పు కాదు
కంటకములెన్నియో మననంటియుండు
వగచి విలపింప కష్టమ్ములెగిరిపోవు
వలయునది యొక్కటే స్థితప్రజ్ఞ యద్ది

నీలిమేఘాలలో మది తేలునపుడు
నిశ్చల తటాకమై మది నిలచినపుడు
పూలు హసియింప హృదయముప్పొంగినపుడు
రణమునందైన పోరు స్థైర్యమ్ము కలుగు

COMMENTS